ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 9 జూలై 2025

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి
● కలెక్టర్ సత్యప్రసాద్ 8

సాగులో మెళకువలు పాటించాలి
● జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ 8

రోడ్డు ప్రమాదాలకు చెక్

● నివారణకు జిల్లా యంత్రాంగం యాక్షన్ ప్లాన్
● డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అనాలసిస్ బ్యూరో ఏర్పాటు
● జిల్లాలో 43 బ్లాక్ స్పాట్స్ గుర్తింపు
● ఈ యేడాది ఇప్పటి వరకు 251 ప్రమాదాలు



జగిత్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్స్‌గా నమోదు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యాచరణ రూపొందించారు. ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలతో పాటు ప్రమాదాల నివారణకు పౌరుల బాధ్యతలపై అధ్యయనం చేసి ప్లాన్ సిద్ధం చేశారు. రోడ్డు భద్రతా కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, ఇకనుంచి ప్రతీనెల సమీక్షలు నిర్వహించనున్నారు. ఎస్పీతో పాటు హైవే అథారిటీ ఆఫీసర్లు, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌పోర్టు, ఎన్‌పీడీ సీఎల్, మెడికల్ అండ్ హెల్త్, ఫారెస్టు, అగ్రికల్చర్, మున్సిపల్ అధికారులు కమిటీలో భాగస్వామ్యులుగా ఉంటారు. ప్రమాదాల నివారణకు ఆయాశాఖల పరిధిలో విధులు నిర్వహించనున్నారు.

● బ్లాక్ స్పాట్స్‌పై స్పెషల్ ఫోకస్..

జిల్లా మీదుగా 65వ నంబరు నేషనల్ హైవేతో పాటు పలు ప్రాంతాలను లింక్‌చేసే రాష్ట్ర రోడ్లు ఉన్నాయి. గత జనవరి నుంచి జూన్ వరకు జిల్లాలో 251 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 80 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మందికి గాయాలు కాగా ఇందులో వందకు మించి బాధితులు కోలుకోలేక ఇప్పటికీ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 2024 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 451రోడ్డు ప్రమాదాలు జరగ్గా 426 మంది గాయపడ్డారు. 176మంది మృతి చెందారు.

హైవేపై 80శాతం రోడ్డు ప్రమాదాలు జరిగాయి. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు అధికారులు జిల్లాలో మొత్తం 43 ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఇరుకు బ్రిడ్జిలు, ప్రమా దకరంగా మూల మలుపులు, సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకపోవడమే రోడ్డు ప్రమాదాలకు కారణాలుగా గుర్తించారు.

● సమస్యల పరిష్కారంపై దృష్టి

అదనపు కలెక్టర్ అధ్యక్షతన ఈనెల 7న కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. రహదారులను విస్తరించడానికి, ప్రమాదాలను అరికట్టడానికి అందుబాటులో ఉన్న నిధులు, వనరులపై సమీక్షించారు. హైవేలపై వాహనాల స్పీడ్ తగ్గించడానికి బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. స్పీడ్ గన్స్ ఏర్పాటు చేసి పెనాల్టీలు విధించే యోచన చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ కచ్చితంగా పనిచేసేలా చర్యలు తీసుకోవడం, కొత్తగా ట్రాఫిక్‌సిగ్నల్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించాలని నిర్ణయించారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి తదితర మున్సిపాలిటీల్లో చౌరస్తాలవద్ద లైన్‌క్రాసింగ్ పెయింటింగ్ వేయించడం, ప్రమాదాల నియంత్రణలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచితేనే ఫలితం ఉంటుందని సేఫ్టీ కమిటీ భావిస్తోంది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు డ్రంకెన్‌డ్రైవ్...

మిగతా 8లో

'మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి'



మాట్లాడుతున్న డీఆర్డీవో రఘువరణ్

వెల్గటూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళ సంఘాలకు అందజేస్తున్న ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని డీఆర్డీవో రఘువరణ్ సూచించారు. వెల్గటూర్ మండల సమాఖ్యలో ఉమ్మడి వెల్గటూర్ మండలం ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్డీవో మహిళ సమాఖ్య సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. రాష్ట్రంలోని మహిళ సంఘ సభ్యులను కోటీశ్వరులను చేయాలని ప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశపెడుతోందని తెలిపారు. ఏపీఎం చంద్రకళ మాట్లాడుతూ మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి వీలుగా మండల సమాఖ్యకు బస్సును మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 980 సంఘాలకుగాను 61కోట్ల రూపాయలు రుణం ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.9 కోట్లు రుణాలు అందజేసినట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం పీఎంఎఫ్‌ఎంఈ స్కీం ద్వారా 21 మంది సభ్యులకు రూ.1.97 కోట్లు 35 శాతం సబ్సిడీతో అందజేసిటన్లు తెలిపారు. మహిళ సంఘ సభ్యులకు మంజూరు అయిన వడ్డీ లేని రుణాలు ఈ నెల 12 నుండి వారి సంఘాల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆర్థికంగా అభివృద్ధి చెందిన మహిళలను డీఆర్డీవో రఘువరణ్ సన్మానించారు. మండల సమాఖ్య ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రజిత, కార్యదర్శి మౌనిక, కోశాధికారి మాధవి, సీసీలు మురళి, గంగారాం, తిరుపతి, సతీష్, ప్రేమలత, వీవో అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి

-కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవిందర్

కోరుట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ రవిందర్ అన్నారు. మంగళవారం పట్టణంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి మున్సిపల్, మెప్మా సిబ్బందితో మొక్కలను నాటి వాటి పరిరక్షణకు ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. ఆకుపచ్చ తెలంగాణ రాష్ట్రంగా మార్చాలన్న ప్రభుత్వ పిలుపు మేరకు ప్రతి మహిళ మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ రవిందర్ సూచించారు. కార్యక్రమంలో అకౌంట్ అధికారి శివకుమార్, ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి కాంతి కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేష్, మెప్మా సిబ్బంది టిఎంసి శ్రీరాం, సీఓలు సంధ్య, గంగామణి, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బుగ్గారం ఎస్సైగా సతీష్ బాధ్యతల స్వీకరణ

బుగ్గారం, జూలై 8(ఆంధ్రజ్యోతి): బుగ్గారం ఎస్సైగా గొంగటి సతీష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అందరి సహకారంతో అరికడుతానని ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బీర్‌పూర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి రెనోవేషన్ కమిటీ ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయ రెనోవేషన్ కమిటీలో సభ్యులుగా ఉండేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖా స్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆశక్తి ఉన్నవారు 20 రోజుల్లో దేవాదాయ శాఖ అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు.

రాయితీపై కంది విత్తనాలు

ఇబ్రహీంపట్నం, జూలై8 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా రాయితీపై కంది విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక రైతు వేదికలో మంగళవారం రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి పంటల విస్తీర్ణాన్ని పెంచి ఆహార భద్రత సాధించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ వెంకటరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఏఈవోలు వినోద్, రవళిక, సాయికృప పాల్గొన్నారు.

పంద్రాగస్టులోపు భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలి

-కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు లోపు భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో భూ భారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తులపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సత్యప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను వేగవంతంగా పూర్తి చేసి పరిష్కరించాలన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను ఆగస్టు 15వ తేదీ లోపు పరిష్కరించాలని ఆదేశించారు. పలు రికార్డులు తేడా ఉన్న సర్వే నెంబర్ల మీద క్షేత్ర స్థాయిలో మరియు రికార్డు పరంగా విచారణ చేసి సరి చేయాలని సూచించారు. కోర్టు కేసుల్లో ఉన్న భూముల విషయంలో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. భూసేకరణ విషయంలో తొందరగా అవార్డు చేయాలని, ఫారెస్ట్, రెవెన్యూ వివాదాలు జాయింట్ సర్వే చేసి పరిష్కారం చేయాలని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. అక్రమ ఇసుక రమణ చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారులు, జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆరోగ్య మందిర్ నిర్మాణాలను వేగవంతం చేయాలి

వెల్గటూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, కిషన్‌రావుపేట గ్రామాలలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం భవనాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈకార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, ఈ పిఆర్‌ఓ లక్ష్మణరావు, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, పీడీ హౌసింగ్ ప్రసాద్, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

'సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి'



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను సవరించి మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. యూనియన్ల ఏర్పాటు యాజమాన్యాల కనుసన్నల్లో జరిగే విధానాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు సుతారి రాములు, ఎండి ముఖ్రం, పుప్పాల శ్రీకాంత్, చింతా భూమేశ్వర్ ఐఎఫ్‌టీయూ, భీమయ్య, లక్ష్మీ ఏఐఎఫ్‌టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●కోరుట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బుధవారం నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుతో పాటు కనీస వేతన సవరించి కార్మికులకు నెలకు రూ.26,000 వేతనం అందించాలని అన్నారు. అంగన్‌వాడీ, బీడీ, హమాలీ కార్మికులు పాల్గొన్ని సమ్మె విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా శీత్లా భవాని ఉత్సవాలు



చింతలూరు గ్రామంలో పూజలు చేస్తున్న గిరిజనులు

రాయికల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం దావన్‌పెల్లి గ్రామంలో మంగళవారం శీత్లా భవాని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బంజారా, గిరిజనులు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని, పశు సంపద పెరగాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పూజారి హంజారియా నాయక్, లక్ష్మణ్ నాయక్, సేవాలాల్ మహారాజ్ అభివృద్ధి కమిటీ ఇన్‌చార్జి, బీజేపీ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు తిరుపతి నాయక్, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఉప సర్పంచ్ బిక్కు నాయక్, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బలరాం నాయక్ రవి, రాజు నాయక్, రవి నాయక్, గంగన్న, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

●మండలంలోని చింతలూరు గ్రామంలో శీత్లా భవానీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు రమేష్ నాయక్, ఉప సర్పంచ్ ప్రభాకర్, నాయకులు జాటోతు బాబు రావు నాయక్, రెడ్డి నాయక్, రాజు నాయక్, రామ్‌లాల్, మోతీలాల్, రాజేశం, తిరుపతి, గంగాధర్, రమేష్, సుమన్, శేఖర్ పాల్గొన్నారు.

●కథలాపూర్: మండలంలోని కలికోట గిరిజన తండాలో సీత్లా భవాని వేడుకలు గిరిజనులు ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులో ఉన్న అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల విత్తనాలను మొలకెత్తించి డప్పుచప్పుళ్ళతో గిరిజన మహిళలు నృత్యాలు చేస్తూ అమ్మ వారి ప్రతిమ ముందు ఉంచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫిషరీస్ విభాగం రాష్ట్ర కార్యదర్శి కల్లెడ గంగాధర్, దరావత్ ప్రకాశ్, గోపి, రాజేశ్, రమేశ్, విఠల్‌నాయక్ ఉన్నారు.

●మల్లాపూర్: మండలంలోని సిర్పూర్ గ్రామంలో శీత్లా భవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బంజారాల ఆడపడుచులు నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఆల్ ఇండియా బంజారా సేవ సంఘ్ జిల్లా అధ్యక్షుడు భూక్యా గోవింద్‌నాయక్, తెలంగాణ గిరిజన ఉపాధ్యా య సంఘం అధ్యక్షుడు నునావత్ రాజు నాయక్, నూనవత్ దేవదాస్‌నాయక్, నునావత్ గోవింద్ నాయక్, బదవత్ రామునాయక్ పాల్గొన్నారు.

'గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి'



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో రూ.35 లక్షలతో నిర్మిస్తున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌తో రైతుల భూములకు ఎట్టి పరిస్థితుల్లో నష్టం జరగనివ్వనని తెలిపారు. కొందరు నాయకులు తమ స్వలాభం కోసం రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు గమనించాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తానని అన్నారు. అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రమాదేవి, నాయకులు రాజేంద్రప్రసాద్, ఎల్లారెడ్డి, బాలముకుందం, నారాయణరెడ్డి, జనగం నరేష్, సతీష్ పాల్గొన్నారు.

'పచ్చిరొట్టతో అధిక దిగుబడి'

కథలాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ యోగిత సూచించారు. సాగులో యూరియా వినియోగం తగ్గించుకోవచ్చని ఏఓ అన్నారు. మండలంలోని తుర్తి, బొమ్మెన గ్రామాల్లో జనుము, జీలుగ సాగు చేసిన రైతుల వద్దకు వెళ్ళి వాటి ప్రయోజనాలను వివరించారు. పచ్చిరొట్టను కలియ దున్ని ఎకరాకు 100 కిలోల చొప్పున సింగిల్ సూపర్ ఫాస్పేట్ (ఎస్ఎస్‌పీ)ను చల్లి 10 రోజులు మురిగేలా చూడాలని పేర్కొన్నారు. దీంతో యూరియా బస్తాలను తగ్గించుకోడానికి అవకాశం ఉంటుందని చీడ, పీడల నుంచి రక్షించుకోచ్చని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఏఈఓలు శేఖర్, నవిత, రైతులు అల్లూరి బాపురెడ్డి, కొమ్ముల కిషన్‌రెడ్డి, ముంజ లస్మయ్య, మాజీ సర్పంచ్ మట్కం గంగభూమయ్య తదితరులు ఉన్నారు.

రక్తదానం

జగిత్యాలరూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన నలువాల విష్ణువర్ధన్ అనే యువకుడు అనీమియాతో బాధపడుతున్న పుష్పలత అనే మహిళకు రక్తదానం చేశాడు. బాధిత మహిళకు ఇటీవలే కాలు విరుగగా ఆపరేషన్ నిమిత్తం రక్తం అవసరం పడింది. బాధిత మహిళకు సమయానికి రక్తదానం చేసి ఆదుకున్న విష్ణువర్ధన్‌ను గ్రామ యువకులు, గ్రామస్థులు అభినందించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దావ వసంత

జగిత్యాల క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆరోపించారు. జిల్లాలో యూరియా సమస్య తీర్చాలని, పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అదనపు కలెక్టర్ బీఎస్ లతకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహ రించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ఆరోపణలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుతోందన్నారు. తక్షణమే రైతులకే సరిపడా యూరియాతో పాటు పెంచిన యూరియా ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌రావు, గంగాధర్, అనీల్, మల్లేశ్, రాజు, ప్రవీణ్, శంకర్, గంగాధర్, సత్యం రావు, ప్రవీణ్, శ్రీధర్ రెడ్డి, గంగారెడ్డి. ప్రశాంత్ రావు, ముత్తయ్య, హరీష్, సన్నిత్‌రావు తదితరులు ఉన్నారు.

వరద గండం

- భయంభయంగా గడుపుతున్న జమ్మికుంట హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులు
- 2018, 2021లో నీట మునిగిన ఇళ్లు
- నష్టపరిహారం అందజేసి చేతులు దులుపుకున్నవైనం
- శాశ్వత చర్యలు కరువు

జమ్మికుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఐదు వందల కుటుంబాలు నివసిస్తున్న జమ్మికుంట హౌసింగ్ బోర్డు కాలనీ వర్షాకాలం వచ్చిందంటే వరద భయంతో బిక్కుబిక్కుమంటోంది. భారీ వర్షం కురిసిందంటే కాలనీలోని ఇళ్లన్నీ నీట మునుగాల్సిందే. వరద నీరు ఇళ్లలోకి చొచ్చుకువచ్చి నిత్యవసర వస్తువులు నీళ్ల పాలై, కట్టుబట్టలతో కాలనీ వాసులు రోడ్డు ఎక్కిన సంఘటనలు ఉన్నాయి. గడిచిన ఆరేళ్ల కాలంలో రెండుసార్లు కాలనీ నీటిమునిగింది. ఆ సమయంలో పాలకులు, అధికారులు హడావుడి చేసి నష్టపరిహారం అందించి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికి శాశ్వత పరిష్కారం చూపలేక పోయారు. మళ్లీ వర్షాకాలం రావడంతో కాలనీవాసులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు.



వరద ఉధృతి (ఫైల్)



హౌసింగ్‌బోర్డులో వరద నీరు (ఫైల్)

లోతట్టు ప్రాంతం..

జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనిలో ఐదు వందల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. లోతట్టు ప్రాంతం కావడంతో 2018లో కురిసిన భారీ వర్షానికి సుమారు మూడు వందల ఇళ్లు నీట మునిగాయి. నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, నగదు నీళ్లపాలయ్యాయి. కట్టుబట్టలతో బంధువుల ఇళ్లకు వెళ్లి తల దాచుకున్నారు. మూడు రోజుల పాటు పాలకులు, అధికారులు పని చేస్తే వరద నీరు బయటకు వెళ్లింది. ఆ సమ యంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం అందలేదు.

వరద కాలువ నిర్మించినా..

మున్సిపల్ పాలకవర్గం 2018లో 35 లక్షల నిధులతో వరద కాలువ నిర్మాణ పనులు చేపట్టింది. 2020లో పనులు పూర్తయ్యాయి. దానితో ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది. 2021లో కురిసిన భారీ వర్షానికి హౌసింగ్‌బోర్డు కాలనీలోని మూడు వందలకు పైగా ఇళ్లు నీట మునిగాయి. వరద కాలువ నుంచి ఉప్పొంగిన నీళ్లు కాలనీని చుట్టుముట్టాయి. ఆ సమయంలో హుజూరాబాద్ ఉప ఎన్నిక సమీపించడంతో, అధికార యంత్రాంగం మొత్తం కదిలి వచ్చింది. దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టింది. కాలనీలోని పార్కు దగ్గర నుంచి ఏడు పీట్ల వెడల్పుతో ఎక్స్‌కావేటర్ల సహాయంతో మట్టి కాల్వ తీయడంతో వరద నీరు వెళ్లిపోయింది. 2021లో హౌసింగ్ బోర్డు కాలని దుస్థితిని చూసిన అప్పటి కలెక్టర్ వరద కాలువను విస్తరించాలని, ఇందుకు ఎస్టిమేట్ రూపొందించి ప్రభుత్వానికి పంపించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. 53 లక్షలతో అధికారులు ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కాలేదు. వర్షాకాలం వచ్చింది. ఈసారి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో హౌసంగ్‌బోర్డు కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. తమ కాలనీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.



నీట మునిగిన ఇల్లు (ఫైల్)

శాశ్వత పరిష్కారం చూపించాలి

శ్రీపతి నరేష్, మాజీ కౌన్సిలర్



వరద కాల్వ నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలి. మళ్లీ వర్షాకాలం వచ్చింది. భారీ వర్షం పడితే కాలనీవాసులు కంటి మీద కునుకు లేకుండా జాగా రం చేయాల్సిన దుస్థితి. 2018, 2021లో ఇళ్లు నీట మునిగాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వరద కాలు వ నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపించాలి.

వరదలతో తీవ్రంగా నష్టపోయాం

బెజ్జంకి నరహరి, హౌసింగ్‌బోర్డు కాలనీవాసి



హౌసింగ్‌బోర్డు కాలనీలో 22 సంవత్సరాలుగా నివసిస్తున్నా. 2018లో మొదటి సారి ఇళ్లు మొత్తం నీట మునిగాయి. ఆ సమయంలో ఒక వైపు వరద కాల్వ నిర్మించి వదిలేశారు. 2021లో మళ్లీ భారీ వర్షాలు వచ్చాయి. ఆ సమయంలో కాలనిలోని వందలాది ఇళ్లు నీట మునిగాయి. నిత్యవసర వస్తువులు, నగదు, ఇతర వస్తువులు మొత్తం నీటిపాలయ్యాయి. వరద తగ్గేవరకు బంధువుల ఇళ్లలో తలదాచుకున్నాం. వరద సమయంలో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం స్పందించి వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలి.

15 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జమ్మికుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల శాంతినగర్‌లో 15కిలోల గంజాయిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు మంగళవారం పట్టుకున్నారు. కరీంనగర్‌కు చెందిన అఫ్రిద్, శశిప్రీతం, తరుణ్, జమ్మికుంటకు చెందిన ప్రేమ్‌చంద్‌కుమార్ ఒక ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్-ఒరిస్సా సరిహద్దులో తక్కువ ధరకు కొనుగోలు చేసి స్థానికంగా ఎక్కువ ధరకు అమ్మవచ్చని అభిప్రాయానికి వచ్చారు. నలుగురు కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై ఇటీవల ఆంధ్రప్రదేశ్-ఒరిస్సా సరిహద్దుకు వెళ్లారు. అక్కడ 15కిలోల గంజాయి కొనుగోలు చేసి మంగళవారం ఇక్కడకు వచ్చారు. జమ్మికుంటకు చెందిన ప్రేమ్‌చంద్‌కుమార్ ఇంట్లో నిల్వచేసి తర్వాత అమ్మకాలు జరుపుదామని నిర్ణయానికి వచ్చారు. పక్కా సమాచారం అందుకున్న కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు వారిని వలపన్ని పట్టుకున్నారు. వారివద్ద ఉన్న 15కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని జమ్మికుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంజాయి ముఠా వివరాల కోసం సీఐ ఎస్ రామకృష్ణగౌడ్‌ను సంప్రదించగా బుధవారం వెల్లడిస్తామని తెలిపారు.

40మంది మందుబాబులకు జరిమానా

సిరిసిల్ల క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 40మంది మందుబాబులకు మంగళవారం సిరిసిల్ల 2వ శ్రేణి మెజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు ఇచ్చారని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 27మందికి ఒక్కొక్కరికి 1000 రూపాయలు, మరో ముగ్గురికి 1500 రూపాయలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడిన 13మందికి ఒక్కొక్కరికి 1000 రూపాయల జరిమానా విధించారన్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని పట్టుబడిన మందుబాబులకు సిరిసిల్ల ట్రాఫిక్ ఆర్ఎస్ఐ దిలీప్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చి, మద్యం సేవించి వాహనాలు నడపబోమని ప్రతిజ్ఞ చేయించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా జైలు శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన యవతకు భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ట్రాఫిక్, రోడ్ భద్రత నియమాలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఎనిమిది మందితో పాటు ఇటీవల ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ఇద్దరిని తహసీల్దార్ ఎదుట మంగళవారం హాజరుపరచి బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చేగుర్తి శివారులోని వాగు నుంచి ఇసుకను దొంగతనంగా ట్రాక్టర్ ద్వారా రవాణా చేస్తూ పట్టుబడిన దుర్శేడ్ గ్రామానికి చెందిన కాశిపాక అర్జున్, నల్లగుంటపల్లికి చెందిన విలాసాగరం శేఖర్‌లతో పాటు ఇటీవల పేకాట ఆడుతూ పట్టుబడిన ఎనిమిది మందిని కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరుపరచినట్లు తెలిపారు. మరోసారి తప్పు చేసిన సందర్భంలో లక్ష రూపాయల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష విధించేలాగా బైండోవర్ చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తెగిపడి గొర్రెలు మృతి

కాల్వశ్రీరాంపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారుపల్లి గ్రామంలో విద్యుత్ తీగలు తెగిపడి గొర్రెలు మృతి చెందాయి. గొర్లకాపరి గిరవేన అజయ్ మంగళవారం గ్రామశివారు నక్కల ఒర్రె సమీపంలో గొర్రెలను మేపుతుండగా కరెంటు వైర్లు తెగిపడి మూడు గొర్రెలు మృతి చెందాయి. మాజీసర్పంచ్ గాజనవేన సదయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే విద్యుత్ అధికారులకు తెలుపగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. చనిపోయిన గొర్రెల విలువ సుమారు 40 వేల రూపాయలు ఉంటుందని బాధితుడు అజయ్ తెలిపారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆయన వేడుకుంటున్నాడు.

మొబైల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఆరెపల్లికి చెందిన బి సాయికిరణ్ మార్చి 21న తన సెల్‌ఫోన్‌ను గ్రామంలో పోగొట్టుకోగా కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీతో సెల్‌ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం సెల్‌ఫోన్‌ను యజమాని సాయికిరణ్‌కు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి పోలీసుఠాణాలో అందజేశారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకోవటంలో కృషి చేసిన కరీంనగర్ రూరల్ ఠాణా కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న వీర్నపల్లి ఎస్ఐ లక్ష్మణ్

వీర్నపల్లి: నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్)తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వెతికి పట్టుకున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన గుంటుకు రాజు పదిరోజుల క్రితం సెల్‌ఫోన్ పొగొట్టుకోగా పోలీసులకు పిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్ కనుక్కోని పిర్యాదుదారుడికి అందించారు.

అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్

ధర్మపురి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై పది రోజుల క్రితం అత్యాచారం చేసిన కేసులో గాదెపల్లి గ్రామానికి చెందిన నిందితుడు వెలుగు గంగాధర్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఉదయ్ కుమార్ కేసు నమోదు చేయగా నిందితుడు గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

జగిత్యాల క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉరి వేసుకుని పూజిత(20) అనే వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారానికి చెందిన చందు అనే యువకుడికి జగిత్యాల జిల్లా భీమారం మండలం రాగోజీపేట గ్రామానికి చెందిన పూజితతో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఉపాధి కోసం వీరు జగిత్యాలలోని కృష్ణానగర్ ప్రాంతానికి వలస వచ్చారు. పూజిత తండ్రి మల్లేశ్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, పెద్దనాన్న ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అప్పటి నుంచి పూజిత మానసిక వేదనకు గురైంది. మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై యువకుడు..

తంగళ్లపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీర్లవంచ గ్రామానికి చెందిన గంగు శ్రీనివాస్(22) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుంటుంబసభ్యుల కథనం.. గంగు బక్కయ్య-వజ్రవ్వ దంపతుల కుమారుడు శ్రీనివాస్ కొద్దిరోజులుగా వ్యసనాలకు, మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాస్ గ్రామ శివారులోని గ్రామ పంచాయతీ డంపుయార్డ్ షెడ్డులో మంగళవారం ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడి తండ్రి బక్కయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీనివాస్(ఫైల్)

బావిలో పడి వృద్ధురాలి మృతి

ఇల్లందకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రివానిపల్లెకు చెందిన కాటిపల్లి అమృతమ్మ (70) అనే వృద్ధురాలు బావిలో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృతమ్మ కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం వెతుకగా మంగళవారం అదే గ్రామంలోని ఓ బావిలో మృతి చెంది కనపడింది. మృతురాలి కుమారుడు రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

భూ వివాదం కేసులో ఒకరి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): భూవివాదం కేసులో ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన మునిగే మల్లయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు. గ్రామంలోని అన్నదమ్ములు మునిగే దేవయ్య, మునిగే మల్లయ్య మధ్య కొంతకాలంగా భూవివాదం కొనసాగుతోందని పేర్కొన్నారు. గత నెల 25న ఇరు కుటుంబాల మధ్య గొడవ తారా స్థాయికి చేరుకోవడంతో ఆగ్రహించిన మల్లయ్య కర్రతో దేవయ్యపై దాడి చేసి గాయపర్చాడని చెప్పారు. బాధితుడు దేవయ్య భార్య అరుణ ఫిర్యాదు మేరకు మునిగే మల్లయ్య, అతని భార్య మనెవ్వలపై కేసు నమోదు చేశామని చెప్పారు. దర్యాప్తు అనంతరం మల్లయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఇద్దరు విలేకరులపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నావంటూ ఓ వ్యక్తిని డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు తహసీల్దార్ పేరిట డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు దిగిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విలేకరులు శ్రీరామోజు ప్రవీణ్, ఒగ్గు బాలరాజుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజన్నపేటకు చెందిన వ్యక్తి ఊడుగుల సురేందర్ ఈనెల 6న తన రెండు టిప్పర్లతో మట్టిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద పోస్తున్న క్రమంలో ప్రవీణ్, బాలరాజు అక్కడకు చేరుకుని అనుమతి లేదం టూ బెదిరించి పేపర్లలో రాకుండా ఉండేందుకు రూ.10 వేలు తీసుకున్నారని పేర్కొన్నారు. మరుసటి రోజు మట్టిని రవాణా చేసుకునేందుకు తహసీల్దార్ రూ.30 వేలు అ డుగుతున్నారని చెప్పడంతో పాటు ఇబ్బందులకు గురి చేసి అసత్యప్రచారం చేశారని చెప్పారు. సదరు వ్యక్తి వద్ద డబ్బులు తీసుకోవడంతో పాటు తన పేరు చెప్పి రూ.30 వేలు డిమాండ్ చేసిన విలేకరులు ప్రవీణ్, బాలరాజుపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సుజాత ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

9న ఇసుక వేలం

కరీంనగర్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకోగా ఆ ఇసుకను ఈ నెల 9న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు కొత్తపల్లి తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 80 టన్నుల వరకు ఇసుక వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్తు సొమ్ము 600 రూపాయలు చెల్లించి పద్మనగర్‌లోని కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆరవణలో నిర్వహించనున్న వేలంలో పాల్గొనాలని సూచించారు. అలాగే తనీఖీల్లో పట్టుబడిన 10 ట్రాక్టర్ల ఇసుకను తహసీల్దార్ కార్యాల య ఆవరణలో వేలం వేయనున్నట్లు తెలిపారు. దీని వేలంలో పాల్గొనేవారు 1,650 రూపాయలు ధరావత్తు సొమ్ము చెల్లించాలని సూచించారు.

తల్లిదండ్రులను పోషిస్తేనే ఆస్తులు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీవో వెంకటేశ్వర్లు

- ఆర్డీవో వెంకటేశ్వర్లు

సిరిసిల్ల టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను అన్ని విధాలుగా పోషిస్తేనే వారసత్వంగా వచ్చే ఆస్తులు కొడుకులకు చెందుతా యని ఆర్డీవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో తెలంగాణ సీనియర్ సీనియర్ సిటీజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులను విస్మరించిన కొడుకులు, కూతుళ్లతో పాటు కోడళ్లకు ఆర్డీవో వెంకటేశ్వర్లు కౌన్సెలింగ్ నిర్వహించి నాలుగు కేసులను పరిష్కరించారు.

ఈ సందర్భంగా ఆర్డీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తల్లిదండ్రులను పోషించడంలో కొడుకులు, కూతుళ్లు నిర్లక్ష్యం చేస్తే సంపాదించిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రుల పేరిట నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, కోశాధికారి దొంత దేవదాసు, సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, అధికారులు బాధిత తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బూరుగు చెరువులోకి నీటి విడుదల

- సంతోషం వ్యక్తం చేస్తున్నరైతులు

కోనరావుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బూరుగు చెరువులోకి నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం కనగర్తి బూరుగు చెరువులోకి అధికారులు స్పందించి పైప్ లైన్లు ఏర్పాటు చేసి నీరు వచ్చేలా చేశారు. ఈ మధ్యనే మల్కపేట రిజర్వాయర్ నుంచి కుడి కాలువ ద్వారా నీటిని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విడుదల చేశారు. నీటిని మారుపాక, సుద్దాల గ్రామాలకు వెళ్లడానికి కనగర్తి గ్రామం వద్ద అడ్డుకట్ట వేశారు. దీంతో కనగర్తి గ్రామంలోని బూరుగు చెరువుకు నీరు అందలేదు. వానాకాలం సీజన్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అడ్డుకట్టను తొలగించి పైప్‌లైన్ ఏర్పాటు చేసి బూరుగు చెరువులోకి నీరు చేరే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కనగర్తి బూరుగు చెరువులోకి చేరుతున్న నీరు

ఆత్మహత్యాయత్నం చేసిన ఇంటర్ విద్యార్థి మృతి

జగిత్యాల క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫెయిల్ అయ్యాడనే మనస్తాపంతో జగిత్యాలలో ఆత్మహత్యాయత్నం చేసిన ఇంటర్ విద్యార్థి నల్ల లోహన్(17) మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన నల్ల లోహన్ పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ కావడంతో అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో లోహన్ ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు, గమనించిన కుటుంబసభ్యులు ఆసు పత్రికి తరలించగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుప త్రిలో చికిత్స పొందుతూ లోహన్ మంగళవారం ఉదయం మృతి చెందాడు. విద్యార్థి తండ్రి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

జీవో నంబర్ 282ను రద్దు చేయాలి

- సిరిసిల్లలో జీవో కాపీల దహనం

సిరిసిల్ల రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు పనిగంటలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 282ను వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిన జీవో 282ను రద్దుచేయాలంటూ జీవో కాపీలను నాయకులు దహనం చేసి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పెట్టుబడిదారులు, కార్పోరేట్ శక్తుల లాభాల కోసం కార్మిక వర్గాన్ని శ్రమదోపిడిలకు గురి చేసే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానాన్ని 10గంటలుగా మార్చుతూ జారీచేసిన జీవోను సీఐటీయూ వ్యతిరేకిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ ఆచరణలో మాత్రం బీజేపీ ప్రభుత్వానికి అనుకూల విధానాలకు అవలంబిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతోందని కార్మికులకు సంబంధించి షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాల జీవోలను సవరించకుండా పనిగంటలు పెంచుతూ జీవోను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ జీవోకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని బుధవారం కార్మిక చట్టాల హక్కుల పరిరక్షణ కోసం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య, సీఐటయూ నాయకులు జిందం కమలాకర్, బాలయ్య, రాజయ్య, దేవరాజు, లక్ష్మీ, మమత, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

పెద్దపల్లి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన కేశెట్టి శ్రీధర్ అనే యువకుడు అదృశ్యమైనట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ ఒక ప్రటనలో తెలిపారు. సోమవారం ఇంటి నుంచి శ్రీధర్ వెళ్లిపోయి ఇప్పటి వరకు ఇంటికి చేరుకోకపోవడంతో సోదరుడు శ్రీకాంత్ ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

సైదాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని గుజ్జులపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు పూదరి అజయ్ గురువారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కి కిందకు దిగుతుండగా మోకు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయినట్లు స్థానికులు తెలిపారు. చికిత్సకోసం అజయ్‌ని హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం హన్మకొండలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక





ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, ఎంపికైన విద్యార్థితో కోచ్

ధర్మారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు దొంగతుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆర్ అనూష, వి వైష్ణవి ఈ నెల 5వ తేదీన గోదావరిఖని సింగరేణి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీ నుంచి 12 వరకు మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరుపున ఆడనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగో పాల్‌రెడ్డి, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ ఇండియా మిషన్ పాఠశాలకు చెందిన ప్రియాంక కుమారి రాష్ట్ర స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కృష్ణమూర్తిగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోదావరిఖని జవహర్ స్డేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారు. బుధవారం మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎన్నికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ మహేంద్ర, వైస్‌ప్రిన్సిపాల్ ప్రేమానందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అల్ట్రాటెక్ కంపెనీ యాజమాన్యం అభినందించారు.

డిగ్రీ సెకండ్ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ డి. సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి

గణేశ్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఈ విద్యాసంవత్సరానికి చెందిన అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) ద్వితీయ సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి, శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డి. సురేష్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. విభాగాల వారీగా ఉత్తీర్ణత శాతం: బీఏ:65.71శాతం, బీకాం:71.05, బీఎస్సీ (భౌతికశాస్త్రం)81.71, బీఎస్సీ (జీవశాస్త్ర విభాగం): 57.87 శాతం, మొత్తం ఉత్తీర్ణత 69.22 శాతం ఉన్నట్లు వారు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డా. జి. శ్రీనివాస్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డా. రజనీదేవి, డా. కె. సతీష్ కుమార్, అకడమిక్ కో ఆర్డినేటర్లు డా. ఎన్. మనోజ్ కుమార్, డా.విద్య, ఎన్ఎస్ఎస్, కోఆర్డినేటర్ డా. మొగిలి పాల్గొన్నారు.

పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న టీఎన్జీవో కార్యవర్గ సభ్యులు

జ్యోతినగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ డిమాండ్ చేశారు. రామగుండం మండల టీఎన్జీవో కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం ఎన్టీపీసీలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించారు. శంకర్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కమిటీ నాయకత్వం, ఉద్యోగులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీఎన్జీవోల డిమాండ్ల సాధనకు సంబంధించి ఉద్యమానికి ఉద్యోగులు సిద్ధం కావాలన్నారు. జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ, మండల టీఎన్జీవో అధ్యక్షుడు డి.జగన్, కార్యదర్శి పి.కృష్ణ, కోశాధికారి డి.రవితేజ, జిల్లా నాయకులు సందీప్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కొమరయ్య పాల్గొన్నారు.

పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు



వారంలో రెండు నుంచి మూడు సార్లు

వ్యాధి తీవ్రతను బట్టి డయాలసిస్ రోగులకు రెండు నుంచి మూడు రోజుల పాటు డయాలసిస్ చేయాల్సి వస్తుంది. దీంతో కొన్ని ఆసుపత్రుల్లో షిఫ్టుల సంఖ్య పెంచినప్పటికీ సమయం సరిపోకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరికి వారంలో రెండు నుంచి మూడు రోజుల పాటు డయాలసిస్ చేయాల్సి వస్తుందని, ఒక్క రోగికి 4 నుంచి 5గంటల పాటు రక్తం శుద్ధి చేయాల్సి వస్తుందని ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు.


ప్రభుత్వాసుపత్రుల్లో పడకలు సరిపోక ఇబ్బందులు

సరైన సమయానికి వైద్యం అందక మృత్యువాత

కళ్యాణ్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. ఆహారపు అలవాట్లు, పెరిగిన కాలుష్యంతో పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ అవసరం ఉంటుంది. అయితే ప్రభుత్వాసుపత్రిలో సరైన వసతులు లేక రోగుల పరిస్థితి దినదిన గండంగా మారింది. డయాలసిస్ స్థాయికి చేరుకునే రోగులకు సరైన సమయంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. ప్రభుత్వం ఆరు సంవత్సరాల క్రితం డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయగా రోగుల సంఖ్య పెరగడంతో సరైన సమయంలో డయాలసిస్ లభించక ఇబ్బందులు పడుతున్నారు.

ఒకప్పుడు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి ప్రభుత్వాసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రమే డయాలసిస్ సెంటర్లు ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పలు ప్రభుత్వాసుపత్రుల్లో 5 పడకలతో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆరు సంవత్సరాల క్రితం అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 5 పడకల డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇందులో రోజూ నాలుగు షిఫ్టుల్లో 45మంది చికిత్స పొందుతున్నారు. అనంతరం పెద్దపల్లి, మంథని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో కూడా డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో రోజుకు 30మంది, మంథని ప్రభుత్వాసుపత్రిలో 10 మందికి డయాలసిస్ చేస్తున్నారు. ఇదే కాకుండా గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో రోజుకు 35మందికి డయాలసిస్‌ను చేయిస్తున్నారు. వ్యాధిబారిన పడిన వారి సంఖ్య పెరగడంతో పడకలు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాధిని గుర్తించేలోపే మరణాలు



మధుమేహం వ్యాధి స్టేజ్-3కి చేరుకునే బాధితుల సంఖ్య ఎక్కువైంది. మధుమేహం స్టేజ్-1, 2ల్లో ఉన్న వారు సమయానికి మందులు వాడడం, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం వల్ల వ్యాధి తీవ్రత కొంత తగ్గుతున్నప్పటికీ చివరి దశలో వ్యాధిని గుర్తించే సరికి చాలా మంది డయాలసిస్ వరకు వెళ్లాల్సి వస్తుంది. రెండు నెలల క్రితం గోదా వరిఖని రాంనగర్‌కు చెందిన చొప్పరి సదానందం అనే యువకునికి కాళ్లు వాపు రావడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని వైద్యులు తెలిపారు. కొద్ది రోజులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. వారానికి రెండు రోజులు డయాలసిస్ చేయాల్సి రావడంతో సదానందం గోదావరిఖనిలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చికిత్స చేయించుకోవడానికి రాగా పడకలు ఖాళీ లేకపోవడంతో మంథని జనరల్ ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు. అక్కడ కూడా బెడ్లు లేకపోవడంతో పెద్దపల్లికి వెళ్లాలని వైద్యులు సూచించడంతో అక్కడి నుంచి పెద్దపల్లి వెళ్లాడు.

అక్కడ కూడా డయాలసిస్ చేయడం కుదరదని వైద్యులు చెప్పడంతో ఇంటికి వచ్చిన సదానందం రెండు రోజులకే మృతి చెందాడు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలానికి చెందిన నారాయణ అనే వృద్ధుడు మంచిర్యాలలో డయాలసిస్ కేంద్రానికి రాగా అక్కడ ఖాళీ లేకపోవడంతో గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి వచ్చాడు. అక్కడ కూడా బెడ్లు దొరకకపోవడంతో పెద్దపల్లికి వెళ్లాలని సూచించడంతో చివరికి కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చేయించుకున్నాడు.



పెరిగిన కిడ్నీ బాధితులు

రాజశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్, మంథని

వాతావరణ కాలుష్యం, మితి మీరిన ఆహారం, నీటి కాలుష్యంతో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతుంది. వందలో సుమారు 40మంది బార్డర్ లైన్‌లో మధుమేహ వ్యాధికి గురవుతున్నారు. కొందరు షుగర్, బీపీ ఉన్న వారికి కిడ్నీలపై ప్రభావం చూపడంతోపాటు మితిమీరిన ఆహారం తీసుకోవడం, సరైన నిద్రలేకపోవడం, నిత్యం మానసిక ఒత్తిడికి గురి కావడంతో కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారు. ఆహార అలవాట్లను నియంత్రించుకోవాలి. రోజూ వ్యాయామం చేయాలి. యోగా, నడకపై దృష్టి పెట్టాలి.



డయాలసిస్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగులు

ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి

డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణ

గంభీరావుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు సంబంధించి ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను ప్రభుత్వం విడుదల చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్‌లోన్లు, టీజీఐఎల్ఐసీలోన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్‌లతో పాటు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమోషన్లలో మొదట గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను బదిలీ చేసి, తరువాత ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. పీఎస్ హెచ్ఎం ప్రమోషన్లలో బీఈడీ, డీఈడీలలో కామన్ సీనియార్టీ ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు శీల కుమార్, మండల ప్రధాన కార్యదర్శి దోసల మధు, డీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లు కుమ్మరవేణి శ్రీనివాస్, ఎం దేవేంద్రం, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చీకట్ల రాజు, సభ్యులు శ్రీశైలం ఉన్నారు.

మాల కులస్థులకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

ఇల్లందకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాల కులస్థులకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మాదాసు మొగిలి అన్నారు. మంగళవారం ఇల్లంద కుంట పోలీస్‌స్టేషన్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నమదాసు తల భాగంలో కౌశిక్‌రెడ్డి తల ఫొటో పెట్టి మాల కన్నమదాసును, మాలలను అవమానపరుస్తూ, మనోభావాలను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శీత్లా భవాని వేడుకలు



పెగడపల్లిలో నిర్వహించిన వేడుకల్లో గిరిజన మహిళలు

పెగడపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని ఏడుమోటలపల్లి తండాలో మంగళవారం శీత్లా భవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవినాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● **వీర్నపల్లి** : మండలంలోని తండాల్లో శీత్లా భవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. నైవేద్యాలు, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి గద్దెల వద్ద గిరిజనులు సాంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు చేశారు. బంజార సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్ నాయక్ పాల్గొన్నారు. బాబాయిచెర్వు తండాలో జరిగిన వేడుకల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, ఎంపీడీవో అబ్దుల్ వాజీద్, ఏపీవో శ్రీహరితో కలిసి పాల్గొన్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గిరిజనులు నృత్యాలతో వారికి స్వాగతం పలికారు.



వీర్నపల్లి పూజలు నిర్వహిస్తున్న గిరిజన నాయకులు

ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కొత్త సంవత్సరంలోగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి
- 847 మంది నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ
- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు రిజర్వాయర్ ముంపు గ్రామల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం శ్రీకన్వెన్షన్‌లో మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి నిర్వసితులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మిడ్ మానేరు రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నిర్వాసితులు ఇళ్లు కట్టుకోకుండా ఖాళీ ప్లాట్స్ ఉన్న వారికి స్పెషల్ కోటా కింద 847 మంది నిర్వసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో మంజూరు చేశామని, వీటితో వేములవాడ నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇందిరమ్మ ఇళ్లను ఇప్పటికే పంపిణీ చేశామని, స్పెషల్ కోటా కింద మిడ్ మానేరు నిర్వసితలుకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు.

మరో 3 వేల ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు పెండింగ్‌లో విచారణలో ఉన్నాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో మిగిలిన వారికి తప్పని సరిగా మంజూరు చేస్తామన్నారు. అర్బన్ మండలంలో ముంపు గ్రామాల నిర్వాసితులకు తప్పనిసరిగా ఇళ్లు మంజూరు అవుతాయన్నారు. నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. దశంలో ఎక్కడ కూడా పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇవ్వడం లేదని, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలోనే సాధ్యమైందని వివరించారు. రూ.76కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం జరుగుతుందన్నారు. ధనిక రాష్ట్రం తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని ధ్వజమెత్తారు.

ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హయాంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే ఎన్నికల సమయంలో ఇచ్చిన మేరకు ఒక్కో హామీ అమలు చేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృషితో స్టేట్ రిజర్వు బ్యాంకు నుంచి మొదటి సారిగా 5 వేల ఇందిరమ్మ ఇళ్లను ఇప్పించారన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 400 నుంచి 600 చదరపు గజాలలోపు మాత్రమే నిర్మించాలన్నారు. తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలకు ఇళ్లు వచ్చేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య తదితరులు ఉన్నారు.

ఘాట్‌రోడ్డు అపరిశుభ్రత



మల్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా అపరిశుభ్రత దర్శనం ఇస్తోంది. ప్లాసిక్ కవర్లు, తాగి పడేసిన వాటర్ బాటిళ్లు తదితర వ్యర్థాలతో ఘాట్‌రోడ్డుపై నడిచి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం కొండపైన పదుల సంఖ్యలో షిఫ్ట్ పద్ధతిలో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఘాట్‌రోడ్డు దిగువ నుంచి జైజంక్షన్ వరకు అపరిశుభ్రత కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.



కొండగట్టు ఘాట్‌రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు

ముగిసిన పోలీస్ డ్యూటీ మీట్

విజేతలకు పతకాలు అందజేత



విజేతలతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా కరీంనగర్‌లో జరుగుతున్న రాజన్న జోన్-3 స్థాయి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ డ్యూటీ మీట్‌లో ప్రధానంగా ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అవి సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్, యాంటీ సబాటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్, డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్, పోలీస్ ఫొటోగ్రఫీ, పోలీస్ వీడియోగ్రఫీ. వీటిల్లో విజేతలుగా నిలిచిన వారిని ఎంపిక చేసి వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్ పోటీలకు పంపించనున్నారు. ఈ పోటీల్లో మెదక్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల పోలీసులు పలు విభాగాల్లో పతకాలు సాధించారు.

విభాగాల వారీగా డ్యూటీ మీట్ పోటీల్లో విజేతలు:

- సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ విభాగంలో ఫోరెన్సిక్ సైన్స్ రాత పరీక్షలో కరీంనగర్ కమిషనరేట్ గంగాధర పోలీసుఠాణాలో పని చేస్తున్న ఎస్ఐ వంశీకృష్ణ బంగారు పతకం సాధించారు. శంకరపట్నం పోలీసు ఠాణా ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శేఖర్‌రెడ్డి కాంస్య పతకం సాధించారు.

● క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అండ్ క్రిమినల్ చట్టాల విభాగంలో కమిషనరేట్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జి నరేందర్‌రెడ్డి వెండి పతకం సాధించారు.

● మెడికల్ లీగల్ టెస్ట్ విభాగంలో కరీంనగర్ కమిషనరేట్ చొప్పదండి సీఐ ఏ ప్రదీప్‌కుమార్ బంగారు పతకం సాధించగా, గంగాధర పోలీసు ఠాణా ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వంశీకృష్ణ కాంస్య పతకం సాధించారు.

● లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎగ్జిబిట్స్ పరీక్షలో కమిషనరేట్ చెందిన ఎస్ఐ యూనస్‌కు వెండి పతకం సాధించారు.

● ఫింగర్ ప్రింట్ సైన్స్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన ఎస్ఐ యూనస్ గోల్డ్ మెడల్, కమిషనరేట్‌కు చెందిన ఎస్ఐ బి వంశీకృష్ణ బ్రాంజ్ మెడల్ సాధించారు.

● క్రైమ్ సీన్ ఫొటోగ్రఫీ పరీక్షలో కమిషనరేట్ ఎస్సై ఎస్ఐ యూనస్ వెండి పతకం, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎస్ఐ సీహెచ్ గణేష్ కాంస్య పతకాలను సాధించారు.

● పోలీస్ పోర్ట్రైట్ పరీక్షల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ప్రసన్న కుమార్ గోల్డ్ మెడల్ సాధించారు.

● యాంటీ సాబెటేజ్ చెక్‌లో గ్రౌండ్ సర్చ్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన వి సంతోష్, వి వెంకటేష్ కానిస్టేబుల్ గోల్డ్ మెడల్ సాధించారు.

● రూమ్ సర్చ్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు ఎం శ్రవణ్ కుమార్, జి కిరణ్ కుమార్‌లు బంగారు పతకం సాధించగా, కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఇ చంద్రమోహన్, బి కిరణ్ కుమార్ సిల్వర్ మెడల్ సాధించారు.

● వెహికల్ సెర్చ్‌లో కమిషనరేట్‌కు చెందిన ఎస్.ఎస్ శ్రీనివాస్, విరాజులకు బ్రాంజ్ మెడల్స్ దక్కాయి.

● యాక్సెస్ కంట్రోల్‌లో కమిషనరేట్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ టి రమేష్, ఏ మహేష్‌లకు సిల్వర్ మెడల్ సాధించారు.

● డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన డాగ్ హ్యాండ్లర్, పోలీస్ కానిస్టేబుల్ జి శ్రీనివాస్ సిల్వర్ మెడల్ సాధించాడు.

● నార్కోటిక్‌లో కరీంనగర్ కమిషనరేట్ చెందిన ఏ శంకర్ సిల్వర్ మెడల్ సాధించారు.

● కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్‌లో కంప్యూటర్ అవేర్నెస్, ఆబ్జెక్టివ్ టెస్ట్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఏం సతీష్ కుమార్ సిల్వర్ మెడల్ బ్రాంజ్ మెడల్ సాధించారు.

● ఆఫీస్ ఆటోమేషన్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన జి అనిల్ కుమార్ సిల్వర్ మెడల్ సాధించారు.

● ప్రోగ్రామింగ్ ఎబిలిటీలో కరీంనగర్ కమిషనర్‌కు చెందిన ఫోరెన్సిక్ ల్యాబ్ కానిస్టేబుల్ జి సంతోష్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించారు.

● పోలీస్ ఫొటోగ్రఫీ విభాగంలో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ మల్లేశం బ్రాంజ్ మెడల్ సాధించారు.

● క్రైమ్ సీన్ అబ్జర్వేషన్ విభాగం రాత, ప్రాక్టికల్ పరీక్ష పోటీలలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో మహిళా పోలీసుఠాణాలో పనిచేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ పి కిషోర్‌గౌడ్ గోల్డ్ మెడల్ సాధించగా, కమిషనరేట్‌లోని రూరల్ పోలీసు ఠాణాలో పని చేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఎస్ రాజ్‌కుమార్‌కు సిల్వర్ మెడల్ సాధించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, అడిషనల్ డీసీపీ (ఏఆర్) భీం రావు, ఏసీపీలు విజయ్ కుమార్, వేణుగోపాల్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం అందలేదని రోడ్డుపై బైఠాయించిన రైతులు

శంకరపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం శివారులో జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం రాలేదని మంగళవారం బైపాస్ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మ్యాకల కొంరయ్య, సముద్రాల చంద్రయ్య మాట్లాడుతూ కేశవపట్నం శివారులో సర్వే నంబర్ 73లో ఒక్కొక్కరికి 14 గుంటల చొప్పున మొత్తం 28 గుంటల భూమి ఎన్‌హెచ్-563 బైపాస్ రోడ్డు నిర్మాణంలో పోయిందన్నారు. రెండేళ్లు గడుస్తున్నా తమకు పరిహారం అందలేదని ఆవేదన చెందారు. ఇప్పటికే ఆ స్థలంలో రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. సంబంధిత శాఖాధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేదన్నారు. బైపాస్ రోడ్డుపై బైఠాయించి జాతీయ రహదారి నిర్మాణ సంస్థ వాహనాలను అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సురేఖ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



కేశవపట్నంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

భూభారతిలో 942 దరఖాస్తులు

వినోద్, తహసీల్దార్, కథలాపూర్



ఆంధ్రజ్యోతి: మండలంలో భూ భారతి గ్రామ సభల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

తహసీల్దార్: భూ భారతి గ్రామ సభల్లో 942 దరఖాస్తులు వివిధ సమస్యలపై స్వీకరించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు15 లోపు విచారణ జరిపి నివేదికలు అందిస్తాం.

ఆంధ్రజ్యోతి: రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోందా?

తహసీల్దార్: నూతనంగా రేషన్‌కార్డుల జారీ, కొత్తగా కుటుంబ సభ్యుల పేర్ల నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. ఇప్పటి వరకు 600 మందికి కార్డుల జారీ, పేర్ల సవరణలపై విచారణ జరిపి అప్‌లోడ్ చేశాం.

ఆంధ్రజ్యోతి: సూరమ్మ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల పరిహారం కోసం గ్రామ సభలు నిర్వహించారా?

తహసీల్దార్: కుడి, ఎడమ కాలువల నిర్మాణం కోసం అవసరమయ్యే భూములను గుర్తించాం. భూములు కోల్పోతున్న రైతులతో గ్రామసభలు ఏర్పాటు చేశాం. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను గ్రామ సభల్లో చదివి వినిపించాం. నివేదికలను అధికారులకు నివేదించాం.

-కథలాపూర్

దివ్యాంగులకు వైద్య పరీక్షలు

రాయికల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ ద్వారా వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవి కిరణ్, ఐఈఆర్‌పీ పెద్దోల్ల సృజన, ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ, లక్కాడి రాజిరెడ్డి, రమేష్, సీఆర్‌పీ కుడుకల రవీందర్ పాల్గొన్నారు.

చదువుతోనే గుర్తింపు

రాయికల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చదివితేనే మంచి గుర్తింపు వస్తుందని రాయికల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్తపెల్లి రంజిత్ కుమార్ అన్నారు. మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్, కళాశాలలో డిస్ట్రిక్ట్ 320జి లయన్స్ క్లబ్ దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఇటిక్యాల ప్రైమరీ పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొడుగం అంజిరెడ్డి, ఆదిరెడ్డి, మండలోజు శ్రీనివాస్, కనపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

ధర్మపురి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తమ్మల్లకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గునిశెట్టి అంజయ్య సహకారంతో నోట్ బుక్స్, పెన్నులు, షూష్ మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులు అధ్యక్షులు మామిడాల రవీందర్ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

జగిత్యాల అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను జగిత్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. స్థానిక ఇందిరా భవన్‌లో జరిగిన ఈ వేడుకలలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, మన్సూర్, తాటిపర్తి విజయ లక్ష్మీ, గాజుల రాజేందర్, అనుమల్ల జయశ్రీ, కండ్లపెల్లి దుర్గయ్య, రామేష్ రావు, దర రమేష్, పూల్లారి సత్యనారాయణ, గుంటి జగదీశ్వర్, పులి రాము, నక్క జీవన్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని జువ్వాడ భవనంలో వైఎస్ఆర్ చిత్ర పటంకు పూలమాలలు వేసి నివాళ్లను అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎతిరాజం నర్సయ్య, తిరుమల గంగాధర్, నహీం, రంజిత్, ఎలెటి మహిపాల్ రెడ్డి, రహీమాన్, అడెపు మధు, నేతి శ్రీనివాస్, దివాకర్ పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలోని జువ్వాడి భవన్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యలయంలో కాంగ్రెస్ నాయకులు వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు ఎండి ఖుతుబొద్దీన్ పాషాలు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలు వేసి వేడుకలను జరిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిలివేరి దిలిప్ గౌడ్, శ్రీధర్, రాజరెడ్డి, రాజు, మహేంధర్, ప్రణయ్ గౌడ్, భూమేష్, అందె మారుతి పాల్గొన్నారు.





కోరుట్ల, మెట్‌పల్లిలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

●**ధర్మపురి:** పట్టణంలోని నంది చౌక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

●**రాయికల్:** పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నాయకుడు గోపి రాజరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, నాయకులు కొయ్యడి మహిపాల్ రెడ్డి, తంగెళ్ల రమేష్, తలారి రాజేష్ పాల్గొన్నారు.

●**భీమారం:** మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, జిల్లా నాయకుడు నీరటి మల్లేశం, గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కూరి నరేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మిట్టపల్లి రాజరెడ్డి, పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణగౌడ్, స్వామి, రవి, హన్మండ్లు, గంగన్న, కిషన్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, గంగరాజం పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** వెల్గటూర్ అంబేడ్కర్ చౌక్ వద్ద వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్‌రెడ్డి, గోల్ల తిరుపతి, మెరుగు మురళి గౌడ్, బందెల ఉదయ్, గుండాటి సందీప్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, గుమ్ముల వెంకటేష్, పూదరి రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

●**మల్యాల:** మల్యాలలోని సోనియా గుడి వద్ద వైఎస్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంతరెడ్డి, ఆదిరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, శనిగారపు తిరుపతి, మ్యాక లక్ష్మన్, నాగులపేట సంజీవ్ పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, పీసీసీ కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

●**పెగడపల్లి:** మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, నాయకులు ఒరుగల శ్రీనివాస్, సంధి మల్లారెడ్డి, కడారి తిరుపతి, ఆకుల విష్ణు పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏలాల జలపతిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పుండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బద్దాం నర్సారెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కోటగిరి ఆనంద్‌గౌడ్, వరద సురేష్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు వేగవంతం

● వినియోగదారులకు తీరనున్న లోవోల్టేజీ సమస్య



సిరికొండలో కొనసాగుతున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

కథలాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి తీవ్ర లోవోల్టేజీ సమస్యతో సతమతమవుతున్న రైతులు, ఇతర విద్యుత్ వినియోగదారులకు త్వరలో పరిష్కారం లభించనుంది. మండలంలోని పోసానిపేట, సిరికొండకు ఇటీవల రెండు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రభుత్వం మంజూరు చేయగా టెండర్లు కూడా పూర్తయి కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.2.5 కోట్లు సర్కారు కేటాయించింది. ప్రస్తుతం కథలాపూర్‌లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రెండు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లతో దుంపెట, దూలూరు, పోసానిపేట, సిరికొండ, కథలాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఏటేటా వ్యవసాయ పంపుసెట్లు, వాణిజ్య, వ్యాపార దుకాణాలు, ఇళ్ళ నిర్మాణాలు పెరిగిపోతున్న నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. ఈ సబ్‌స్టేషన్‌లో అధిక ఓల్టేజీ సమస్య ఉత్పన్నమవుతోంది. వేసవిలో అధిక వోల్టేజీ సమస్య కారణంగా తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. సిరికొండ మండలంలోనే అత్యధిక జనాభా ఉన్న గ్రామం కావడంతో అక్కడ విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుంది. కొంతకాలంగా సిరికొండ, పోసానిపేటవాసులు సబ్‌స్టేషన్లు కావాలని కోరుతుండగా విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో సబ్‌స్టేషన్లకు మోక్షం లభించింది. ఈక్రమంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

● విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

దివాకర్‌రావు, ఏఈ ఎన్‌పీడీసీఎల్, కథలాపూర్



విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాం. కాంట్రాక్టర్‌కు పనుల్లో వేగం పెంచాలని ఆదేశాలు జారీ చేశాం. రెండు సబ్‌స్టేషన్లతో కథలాపూర్ సబ్‌స్టేషన్‌పై భారం తగ్గనుంది. దీంతో వినియోగ దారులకు విద్యుత్ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించడానికి వీలు కలుగుతుంది.

అధికారులకు శిక్షణ

సారంగాపూర్, జూలై, 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కమిషన్, కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు సారంగాపూర్ మండల కేంద్రంలో మంగళవారం బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా తహసీల్దార్ హాజరై ఎన్నికలకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకటేష్, రెవెన్యూ, సిబ్బంది, ఏఎల్‌ఎమ్‌టీలు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా శ్యాంప్రసాద్

కొడిమ్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండల ప్రత్యేక అధికారిగా జిల్లా హర్టీకల్చర్ ఆఫీసర్ శ్యాంప్రసాద్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలను స్వీకరించిన ప్రత్యేక అధికారికి ఎంపీడీవో ఇ. స్వరూప అధికారులు పూల బోకెను అందించారు. శాలువా కప్పి సన్మానం చేశారు.

అనంతరం మండల ప్రత్యేక అధికారి మండల అధికారులతో మండల అబివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల ప్రగతి వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ మణిదీప్ ఎంపీవో వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ సురేష్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

తనిఖీలను రెట్టింపు చేయాలని అధికారులు నిర్ణయించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపంపై నిత్యం తనిఖీలు ముమ్మరం చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

● సీపీఆర్‌పై పౌరులకు అవగాహన

రోడ్డు ప్రమాదాల నివారణకు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ ట్రాఫిక్ అనాలసిస్ బ్యూరోను ప్రారంభించి ఇతర శాఖల అధికారులను సమన్వయం చేయడం పై అధికారులు దృష్టి సారించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణకు తగు చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో గల హైవేలపై జరిగే రోడ్డు ప్రమాదాలకు సంబంధించి ఫస్ట్ రెస్పాండర్స్‌గా ఉండేందుకు హైవేలపై ఉన్న పెట్రోల్ బంక్‌ల వారికి, దాబాలో పనిచేసే వారికి, యూత్, గ్రామస్థులకు ఫస్ట్ ఎయిడ్ మరియు సీపీఆర్‌పై అవగాహన కలిగించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. జిల్లాలో ఉన్న బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణపై దృష్టి సారించనున్నారు. రోడ్లపై గుంతలు, సైన్ బోర్డులు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల అక్కడక్కడ ప్రమాదాలు జరుగుతున్నట్లుగా గుర్తించారు. మైనర్ల డ్రైవింగ్‌పై ఇటీవల పోలీసులు చర్యలు తీసుకోగా కొంతమేర ఫలితం కనిపిస్తోంది.

అందరి సహకారంతో ప్రమాదాల నివారణ

-సత్యప్రసాద్, కలెక్టర్



రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేయాలి. ఆ దిశగా అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేయడంతో పాటు పౌరుల భాగస్వామ్యం సైతం ఉండేలా దృష్టి సారించాం. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

-అశోక్ కుమార్, ఎస్పీ



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. పోలీసు శాఖ పరంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి జాగ్రత్తలు చేపట్టాం. ప్రమాదాల నివారణకు అధికార యంత్రాంగంతో పాటు పౌరుల భాగస్వామ్యం అవసరం. అందరూ రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలి.

సాగులో మెళకువలు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

మెట్‌పల్లి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగులో మెళకువలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. సాగులో సూచనలు అందించేందుకు ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమాన్ని చేపట్టిందని ఆయన అన్నారు. మంగళవారం మండలంలోని చౌలమద్ది గ్రామంలోని రైతువేదికలో మండలాధికారి దీపిక నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందించిన మెలకువలను రైతులు పాటించి మంచి లాభలను పొందాలన్నారు. పంటల సాగులో సరైన సమయానికి కలుపు యాజమాన్యం అవసరమైన మార్గాలు ఎంచుకోని అధిక దిగుబడులు పొందాలని రైతులకు సలహాలు సూచనలు చేశారు. అనంతరం ఫర్టిలైజర్ డీలర్స్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అధునాతన ఈపీవోఎస్ యంత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్, ఏవో దీపిక, ఏఈవోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

-మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ టి.మోహన్

మెట్‌పల్లిటౌన్, జూలై8(ఆంధ్రజ్యోతి):మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తు ప్రజలకు నాలాల ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ టి.మోహన్ పారిశుధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వంద రోజుల ప్రణాళికలలో భాగంగా పట్టణంలోని 9వ వార్డులో నాలాలను పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను గుర్తించామని ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, సిబ్బంది ముజీబ్, నిజాం, నరేష్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

-ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జగిత్యాల అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త దివంగత ఎల్‌జిరాం పేరుపై ఏర్పాటు చేసిన ఎల్‌జిరాం హెల్త్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎల్.రమణ ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సొసైటీలు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు ఎల్.రమణ మాట్లాడుతూ అందరికి వైద్యం అందించాలనే సదుద్ధేశంతో ఈ క్యాంపు నిర్వహించామన్నారు. కరీంనగర్ అపోలో ఆసుపత్రి వైద్య బృందం పరీక్షలు ఉచితంగా చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత, మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, ఎల్‌జిరాం హెల్త్ కేర్ ఫౌండేషన్ కార్యదర్శి అయిల్నేని సాగర్‌రావు, గట్టు సతీష్, బాలె శంకర్, కోరుకంటి రాము తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయాన్ని ఎండోమెంట్ పరిధిలోకి తేవొద్దు

మెట్‌పల్లి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయాన్ని దేవాదాయశాఖలో విలీనాన్ని నిలిపివేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు పీసు రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలో మేడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దాపూర్ గ్రామంలో మధ్యలో వెలిసిన పురాతన మల్లికార్జున స్వామి ఆలయం కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా నిలిచిందన్నారు. ఆలయాన్ని గ్రామంలోని భక్తులు ఏండ్ల నుంచి కాపాడుకుంటూ అభివృద్ధి చేశారని, దాన్ని దేవాదాయశాఖలో విలీనం చేయడం సరికాదన్నారు.

ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు



పెగడపల్లిలో సంబరాల్లో పాల్గొన్న మహిళలు

పెగడపల్లి, జులై 8 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని జ్యోతి మండల సమాఖ్య భవనంలో మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దడం, ప్రతి మహిళను కోటీశ్వరురాలును చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యుల సభ్యులకు స్వయం ఉపాది కల్పించడం కోసం రుణాలు మంజూరు చేస్తుందని, ఇందులో బాగంగానే మహిళా శక్తి విజయోత్సవ సంబరాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళా సమాఖ్య సంబరాలలో బాగంగా మండలంలోని పలు సంఘాల మహిళలకు సన్మానాలు చేశారు. కార్యక్రమాలలో ఏపీఎం సమత, సీసీలు రవికుమార్, తిరుపతి, స్వామి, శశికుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు రూపకళ తదితరులు పాల్గొన్నారు.

●**ఇబ్రహీంపట్నం, జూలై8(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి సంబరాలు మంగళవారం స్థానిక మండల సమైక్య కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండల ఏపీఎం శంకర్ మాట్లాడుతూ నూతన సంఘాల ఏర్పాటు, వృద్ధుల సంఘాలు, మహిళా సంఘాల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, గేదెల పెంపకం అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ గురించి సభ్యులకు వివరించారు అలాగే మండల సమైక్య ద్వారా బస్సు కొనుగోలు చేసి మెట్టుపల్లి డిపో నుండి నడిపించడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో సీసీలు సురేఖ సాయి చందర్, రాజశ్రీ, మండల సమైక్య సిబ్బంది, అన్ని గ్రామాల అధ్యక్షురాలు, గ్రామ సంఘ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

బీర్‌పూర్, జూలై 8(ఆంధ్రజ్యోతి):మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే నేతకాని మహార్ రాష్ట్ర స్థాయి ప్రతినిధుల మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం బీర్‌పూర్ మండలంలోని నేతకాని మహార్ సంఘం నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ నెల 20న నేతకాని మహార్ కుల సంఘం రాష్ట్రప్రతినిధుల మహాసభ నిర్వహించనున్నామని తెలిపారు. అన్ని గ్రామాల నుండి అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మీసాల లింగం, దుర్గం శంకర్, గోపాల్, మీసాల చంద్రయ్య, రమేష్, మల్లయ్య, వెంకటేష్, దుబ్బయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పెగడపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ల్యాగలమర్రిలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పెగడపల్లి మార్కెట్ చైర్మన్ రాములు గౌడ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాములు గౌడ్ మాట్లాడుతూ పైలట్ గ్రామమైన ల్యాగలమర్రిలో మొదటి విడత మంజూరైన రెండు ఇండ్లకు సాంకేతిక సమస్యలతో బిల్లు చెల్లింపులో జాప్యం జరిగిందన్నారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ దృష్టికి సమస్యను తీసుకెల్లి అధికారులతో మాట్లాడినట్లు రెండు రోజుల్లో బిల్లు చెల్లింపు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, నాయకులు మారం కొమురయ్య, కడారి తిరుపతి, చాట్ల భాస్కర్, కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలకు రావాలని కేంద్ర మంత్రికి ఆహ్వానం

కొడిమ్యాల, జూలై 8(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని చెప్యాల గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో ఈ నెల 13న ఆదివారం నిర్వహించు బోనాల పండగకు రావాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు మంగళవారం ఆలయ కమిటీ వారు ఆహ్వాన పత్రికను అందించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ వారు కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేను శాలువా కప్పి సన్మాంచారు.

ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు రాజశేఖర్‌రెడి, మల్లారెడ్డి, సునీల్‌రెడ్డి, చిర్ర ప్రవీణ్, గోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కార్తిక్, తిరుపతి తదితరులు ఉన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- కలెక్టర్ సత్యప్రసాద్



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

వెల్గటూర్, జులై 8 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలం లోని చెగ్యాంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవ త్సరం జిల్లాలో 47 లక్షల పైగా మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. మొక్కలు నాటడానికి ప్రతీ శాఖ ఈ నెల 30 వరకు స్థలాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ శాఖ ఏ మొక్కలు నాటుతున్నారో రికార్డులో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, డీఆర్డీవో రఘువరన్, డీసీవో మనోజ్ కుమార్, తహశీల్దార్ శేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ గోల్ల తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు పూదరి రమేష్, రంగు తిరుపతి, రామగిరి నందయ్య, రమేష్, ఎల్లయ్య, శ్రీను, ప్రశాంత్ పాల్గొన్నారు.

మంత్రి వివేక్‌ను కలిసిన జువ్వాడి

కోరుట్ల రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. మంత్రిని సచివాలయంలోని నూతన చాంబర్‌లో కలిసి స్థానికంగా పార్టీ పరిస్థితితో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

మెట్‌పల్లి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్తక్కపల్లి గ్రామానికి చెందిన బక్కశెట్టి స్వామి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు బీమా చెక్కును బ్యాంకు మేనేజర్ అనిల్ అందజేశారు. మంగళవారం గ్రామంలోని బాధిత ఇంటికి వెళ్లి రూ.20.21లక్షల బీమా చెక్కును నాయకులు, సిబ్బందితో కలిసి ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బక్కశెట్టి స్వామి ఎస్‌బీఐ బ్యాంక్‌లో లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకున్నాడు. ఇటీవల ప్రమాదవశాత్తు గుండెపోటుతో మృతి చెందడంతో ఇన్సూరెన్స్‌కు సంబంధించిన చెక్కును అందజేశామన్నారు. కార్యక్రమంలో డివిజనల్ సేల్స్ మేనేజర్ మూల అనిల్, టెర్రిటరి మేనేజర్ మహమూద్, ఎల్‌ఎమ్ బైన ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

మెట్‌పల్లిటౌన్, జూలై8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు మాజీ సీఎం వైఎస్ఆర్ జయంతిని పురష్కరించుకోని వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో 14వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వంగ వేణు, ఎన్‌ఎస్‌యూఐ పట్టణ ఉపాధ్యక్షులు సమీర్, అన్నమయ్య నరేష్ పాల్గొన్నారు.